ఈనాడు
విజయనగరం
బుధవారం అక్టోబరు 9, 2024

నేడు అన్న క్యాంటీన్ల ప్రారంభం


విజయనగరంలో సిద్ధమైన భవనం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలోని ఘోషాసుపత్రి వద్ద బుధవారం నుంచి అన్న క్యాంటీన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఉదయం 7.30 గంటలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతి రాజు ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆర్టీసీ కాంప్లెక్స్, నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా రెండు క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఇకనుంచి మూడు చోట్లా అల్పాహారం, భోజనం లభిస్తుందని నగరపాలిక కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు. మంగళవారం రాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. రూ.35.50 లక్షలతో నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. ఆయన వెంట డీఈఈ రామసుబ్బారావు తదితరులున్నారు.

రాజాం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రాజాంలో అన్న క్యాంటీన్ ముస్తాబైంది. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ప్రారంభించనున్నారు. ఆర్టీసీ కూడలి వద్ద మూడు పూటలా పేదల ఆకలి తీర్చిన ఈ క్యాంటీన్‌ను గత ప్రభుత్వం మూసేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూర్వవైభవం తీసుకొచ్చారు. రూ.20.50 లక్షల అంచనా విలువతో పనులు పూర్తి చేశారు. తొలిరోజు మధ్యాహ్నం భోజనం మాత్రమే అందుబాటులో ఉంటుందని, గురువారం నుంచి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టనున్నట్లు పురపాలక సంఘం ఏఈ వెంకటరామరాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

సర్వదర్శనే ప్రాప్తిరస్తు



పకడ్బందీగా సిరిమానోత్సవ ఏర్పాట్లు

'న్యూస్‌టుడే'తో పైడితల్లి దేవస్థానం ఈవో

ముఖాముఖి

– న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రత్యేకాధికారిగా సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాథరావును నియమించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది రూ.50 లక్షల వరకు ఖర్చు చేయనున్నామని ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. ఈ ఏడాది అందరికీ రుసుం లేకుండా సర్వదర్శనం కల్పించనున్నామని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనానికి అవకాశమిస్తామని చెప్పారు. వివిధ అంశాలపై మంగళవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

3 గంటలకు ప్రారంభం..

ఈనెల 15న సిరిమానోత్సవం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుంది. హుకుంపేటలో ఉదయం 11.30 గంటలకే బయలుదేరి ఒంటి గంట కల్లా ఆలయానికి చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటాం. అనంతరం ఉత్సవం ఉంటుంది. సాయంత్రం 5.30కు పూర్తయ్యేలా చూస్తాం. ఆ బాధ్యతలు ఆర్డీవో చూడనున్నారు.

14 శాఖల పర్యవేక్షణ..

ఉత్సవాల్లో 14 శాఖలవారు భాగస్వామ్యం కానున్నారు. మా శాఖ అధికారులు, సిబ్బందితో పాటు రెవెన్యూ, పోలీసు, నగరపాలిక విభాగాలవారు కీలకం. సిరిమాను తయారీ, బయలు దేరడం, పూజారి కూర్చోవడం తదితర బాధ్యతలను అటవీశాఖ చూస్తోంది. భక్తులకు మజ్జిగ, బిస్కెట్లు అందిస్తాం. నగరపాలిక తాగునీరు ఇస్తుంది. బయో మరుగుదొడ్లు ఉంటాయి. ఆలయ పరిసరాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. అన్నిచోట్లా సీసీ కెమెరాల నిఘా పెట్టాం.

అదనపు సిబ్బంది..

రద్దీ దృష్ట్యా 14, 15వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 100 నుంచి 150 మంది వరకు దేవాదాయశాఖ సిబ్బంది అదనంగా విధుల్లో పాల్గొంటారు. పలు ఆధ్యాత్మిక భక్త మండళ్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సైతం సేవలు అందించనున్నారు.


డీవీవీ.ప్రసాదరావు

అందుబాటులో ప్రసాదాలు..

దర్శనాల అనంతరం లడ్డూ, పులిహోరా ప్రసాదాలు ఇవ్వనున్నాం. తొలేళ్లు, సిరిమాను రోజు నాటికి 50 వేల లడ్డూలు(80 గ్రాములు- రూ.15), 50 వేల పులిహోరా ప్యాకెట్లు(రూ.10) సిద్ధం చేయనున్నాం. ప్రస్తుతం ఏరోజుకారోజు అందిస్తున్నాం. పండగ రెండు రోజుల్లో స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా చక్కెర పొంగలి, దద్దోజనం పంపిణీ చేయనున్నాయి.


మంత్రి శ్రీనివాస్‌కు పనుల వివరాలు చెబుతున్న ఎమ్మెల్యే అదితి

రింగురోడ్డు, న్యూస్‌టుడే: జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేలా విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి పండగను నిర్వహించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి మంగళవారం ఉత్సవ వేదికలను పరిశీలించారు. నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ట్రాక్‌లు, కోర్టులను చూశారు. అనంతరం కోట సుందరీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. మాన్సాస్ మైదానంలో డ్వాక్రా ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై ఆరా తీశారు. సంబంధిత గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల నేపథ్యంలో విజ్జీలో ఉత్తరాంధ్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విజ్జీ మైదానాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే అదితి పేర్కొన్నారు. ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, డీఆర్డీఏ పీడీ కల్యాణ్ చక్రవర్తి, ఏపీడీ సావిత్రి, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, నగరపాలిక కమిషనర్ నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఎంపీ

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పైడితల్లి ఉత్సవాల్లో భాగంగా బుధవారం డయల్ యువర్ ఎంపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సిరిమాను ఊరేగింపు, సమస్యలు.. తదితర వాటిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఎంపీ- 94404 36426, క్యాంపు కార్యాలయం- 89190 60911, నగరపాలక సంస్థ కమిషనర్- 98499 06486 నంబర్లను సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య సంప్రదించాలన్నారు.

అందుబాటులో ఇసుక


చాకరాపల్లి నుంచి యార్డుకు తెచ్చిన ఇసుక

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పారిశ్రామికవాడలోని ఇసుక యార్డులో గతంలో నిల్వ చేసిన సుమారు 75 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు తరిగిపోయాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచి వెళ్లడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో వంగర మండలం చాకరాపల్లి నుంచి తీసుకొస్తున్నారు. సుమారు 45 వేల మెట్రిక్ టన్నులు తరలించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. రోజుకు 400 నుంచి 500 టన్నుల మేర చేరుతోంది. ఈనెల 6న 70, 7న 100, 8న 120 టన్నుల వరకు విక్రయాలు చేపట్టారు. టన్ను రూ.577ల చొప్పున విక్రయిస్తున్నామని తహసీల్దారు శ్రీను తెలిపారు. ఇటీవల పాడైన తూనిక యంత్రం అందుబాటులోకి వచ్చిందని వెల్లడించారు.

అన్నదాతకు.. విశిష్ట గుర్తింపు

విజయనగరం వ్యవసాయ విభాగం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. గతంలో అవగాహన లోపంతో కొందరు పథకాలు పొందలేని పరిస్థితి ఉండేది. ఇకపై ఈ సమస్య లేకుండా అన్నదాతలందరికీ గుర్తింపు సంఖ్యలు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి సంఖ్యపై ఒక్క క్లిక్ చేస్తే పూర్తి వివరాలు ప్రత్యక్షమయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

దేశ వ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి నాటికి 5 కోట్ల మందికి గుర్తింపు సంఖ్యలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 6.68 లక్షల ఎకరాల సాగుభూమి ఉంది. 4.11 లక్షల మంది రైతులున్నారు. వీరందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యలు రానున్నాయి. పంటలను సులభంగా విక్రయించేలా, కనీస మద్దతు ధర పొందేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడనుంది. దేశంలో ఎక్కడి నుంచైనా రుణ అర్హత, బకాయిల వివరాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు.. తదితర వివరాలను తెలుసుకోవచ్చని వ్యవసాయాధికారులు రాబర్ట్‌పాల్, వీటీ.రామారావు తెలిపారు. మార్గదర్శకాలు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

అందరి చూపు.. విజయనగరం వైపు


భోగాపురంలోని అబ్కారీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న ఏసీ రామచంద్రరావు

ఈనాడు, విజయనగరం, న్యూస్‌టుడే, భోగాపురం: మద్యం నూతన పాలసీలో భాగంగా ప్రైవేటు దుకాణాల్లో అమ్మకాలకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో దుకాణాలు దక్కించుకునేందుకు దరఖాస్తుదారులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి ఎక్కువ మంది వ్యాపారులు విజయనగరం వైపు చూస్తున్నారు. ఈమేరకు తమ అనుచరులను రంగంలోకి దించి.. అన్ని ప్రాంతాలకూ పంపించి దరఖాస్తులు చేయిస్తున్నారు.

కొత్తవారిలో ఉత్సాహం..

రెండు జిల్లాల్లో 205 దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉంది. దీంతో ఈ సారి కొత్తవారు సైతం వ్యాపారంలో అడుగు పెట్టేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు.. వివిధ వ్యాపారాలు చేస్తున్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం వీరిలో ఉన్నారు. బొబ్బిలి మండలంలో ఓ కుటుంబంలో అందరూ ఉద్యోగం చేస్తుండటంతో ఇంటి పెద్దావిడ పేరిట దరఖాస్తు చేయించారు. రూ.2 లక్షల చొప్పున కట్టాల్సి ఉన్నా.. ఎవరూ వెనకడుగు వేయడం లేదు.

11 వరకు అవకాశం

ఈనెల ఒకటిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగియనుంది. తొలి ఏడు రోజుల్లో రికార్డు స్థాయిలో 3,214 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ వివరాలన్నీ సులువుగా తెలుసుకోవచ్చని, ఈమేరకు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌ను నవీకరిస్తున్నామని అబ్కారీశాఖ ఏసీ రామచంద్రరావు తెలిపారు. ఆయన మంగళవారం భోగాపురంలోని సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలించారు.

పైడితల్లికి సేవాపీఠం బోనాలు


అలంకరణలో వనంగుడి పైడితల్లి

పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర జిల్లాల భవానీల దీక్ష సేవా పీఠం సంబరాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రైల్వేస్టేషన్ వనంగుడి నుంచి సీఎంఆర్, ఎన్సీఎస్, డాబాతోట, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా పైడితల్లి చదురుగుడికి చేరింది. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఎదురు ఘటాలు, బోనాలు సమర్పించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు సందడి చేశాయి. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్


ఘటాలతో వస్తున్న మహిళలు


చదురుగుడిలో భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్లు


ఘటాలు తీసుకువస్తున్న ఉత్తరాంధ్ర భవానీల దీక్ష సేవా పీఠం సభ్యులు

రెండు వేల మందితో భద్రత


సిరిమాను తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: అమ్మవారి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో రానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రెండు వేల మందితో భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ అమ్మవారి తొలేళ్లు, సిరిమానోత్సవం పండుగ సందర్భంగా పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, భద్రత ఏర్పాట్లను మంగళవారం ఆయన ఎస్పీ వకుల్ జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలతతో కలిసి పరిశీలించారు. దేవాలయం, క్యూలైన్లు, దేవాలయం వెనుక భాగం, కమాండ్ కంట్రోల్ రూం, మూడులాంతర్లు, గురజాడ అప్పారావు రోడ్డు, కోట కూడలి ప్రాంతాలు, గుర్తించిన పాత భవనాలను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో భద్రత ఏర్పాట్లను తనిఖీ చేసి.. అనంతరం పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. దర్శనాలకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు సేవలందించేందుకు పోలీసు అధికారులు, సిబ్బందితో సేవాదళ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీలు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఎస్.రాఘవులు, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, ఎన్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మణరావు, సూరి నాయుడు, దేవాలయ, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన వారికి సహకారం

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి 37వ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులను మంగళవారం సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ తన ఛాంబర్లో అభినందించారు. జాతీయ పోటీలకు అర్హత పొందిన వారికి అన్ని విధాలా సహకారమందిస్తామని హామీ ఇచ్చారు. పోటీల్లో 20 పతకాలు సాధించగా వీటిలో స్వర్ణం 11, రజతం 06, కాంస్యం 03 పతకాలున్నాయి. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


విజేతలతో జేసీ సేధు మాధవన్

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240



జిల్లాలోని పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉంది. చాలా చోట్ల సక్రమంగా దీపాలు వెలగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ్ల విధులు ముగించుకొని ఇళ్లకు చేరే వారు చీకట్లలో ఆందోళన చెందుతున్నారు. శివారు కాలనీల్లో పరిస్థితి దయనీయంగా మారింది. పాడైన కల్వర్టులు, గుంతలు పడిన దారుల్లో ఇళ్లకు చేరేలోపు ప్రమాదాలకు గురవుతున్నారు.

-న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, పాలకొండ, సాలూరు గ్రామీణం

కొత్త దీపాలు వేయాలి..

పట్టణం: పార్వతీపురం
- వార్డులు: 30
- జనాభా: 62వేలు
- వీధి దీపాలు: 2,500
- పనిచేయనవి: 200లకు పైగా


పార్వతీపురం పురపాలికలో బెలగాం, జగన్నాథపురం, కొత్తవలస, కొత్తబెలగాం, వైకేఎంకాలనీ తదితర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. చర్చివీధి, అగ్రహారం వీధి, జనశక్తి కాలనీ, బైపాసుకాలనీ, గణేష్‌నగర్ కాలనీ, ఆసుపత్రి రోడ్డులోనూ ఇదే పరిస్థితి. విశాఖ నుంచి రాత్రి 11 గంటల తర్వాత కోర్బా రైలు పార్వతీపురం చేరుతుంది. ఇళ్లకు చేరే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బైపాసు రోడ్డు, గూడ్స్‌షెడ్, గొల్లవీధి, తపాలా కార్యాలయం, సౌందర్య మార్గం, కృష్ణపల్లి వెళ్లే మార్గంలో కొత్త దీపాలు వేయాల్సి ఉంది.



శివారులో చీకట్లు..

పట్టణం: సాలూరు
- వార్డులు: 29
- జనాభా: 52వేలు
- వీధి దీపాలు: 1,586
- పనిచేయనవి: 200లకు పైగా

సాలూరు పట్టణంలో ప్రధాన కూడళ్లతో పాటు శివారు కాలనీల్లో అంధకారం అలుముకుంటోంది. ఆర్టీసీ కాంప్లెక్సు మార్గం, రైల్వేస్టేషన్ రోడ్డు, చిన హరిజనపేట వీధి, బంగారమ్మకాలనీ, వేంకటేశ్వర, శ్రీనివాస కాలనీల్లోని మార్గాల్లో దీపాలు వెలగడం లేదు.



రాత్రి వేళ ఆందోళన..

పట్టణం: పాలకొండ
- వార్డులు: 20
- జనాభా: 45వేలు
- వీధి దీపాలు: 1,723
- పనిచేయనవి: 300లకు పైగా

పాలకొండ పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్సు చుట్టుపక్కల ప్రధాన మార్గాల్లో కొన్ని చోట్ల దీపాలు వెలగడం లేదు. వడమ కాలనీ, సీతంపేట మార్గం, మార్కెట్ రోడ్డు, అన్నవరం మార్గం తదితర ప్రాంతాల్లో రాత్రివేళ బయట తిరిగేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల దొంగలు సైతం విజృంభిస్తుండటంతో రాత్రి వేళ విధులు ముగించుకొని వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు.



ఫిర్యాదులు వస్తే సరిచేస్తున్నాం..

వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జిల్లా కేంద్రంలో గుత్తేదారు నిర్వహణ సమయం ముగిసింది. ప్రస్తుతం పురపాలిక సంఘం పనులు చేస్తోంది. మరో ఏడాది పాటు గుత్తేదారుకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాం. పాలకొండ, సాలూరు పట్టణాల్లో ఫిర్యాదులు వస్తే సమస్య పరిష్కరిస్తున్నాం.

– కిరణ్ కుమార్, శివప్రసాద్, దేవీప్రసాద్, డీడీఈ, మేనేజరు, ఏఈ, పార్వతీపురం, సాలూరు, పాలకొండ

కేజీబీవీల్లో బోధనేతర ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యావిభాగం, పార్వతీపురం పట్టణం: కేజీబీవీల్లో (టైప్-3,4) ఖాళీగా ఉన్న బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయనగరం, పార్వతీపురం మన్యం డీఈవోలు ఎన్.ప్రేమకుమార్. పగడాలమ్మ తెలిపారు. పొరుగు సేవల ప్రాతిపదికన ఏడాది కాలానికి నియమించనున్నారు. దరఖాస్తులు స్వీకరణ ఈ నెల 7 నుంచి ప్రారంభమైంది. 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును నిర్దేశించారు. విజయనగరం జిల్లాలో సహాయ వంటపనివారు 25, రాత్రి, పగలు కాపలాదారులు 9, స్కావెంజర్ 11, స్వీపర్లు 2, చౌకీదారులు 6, హెడ్ కుక్‌ల విభాగంలో రెండు ఖాళీలున్నాయి. మన్యం జిల్లాలో వంటమనిషి పోస్టులు- 5, సహాయకులు 13, మహిళా కాపలాదారులు- 2, స్వీపర్ -2, చౌకీదార్ ఖాళీలు 3 ఉన్నట్లు చెప్పారు. ఈనెల 15 లోపు ఆఫ్‌లైన్‌లో డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

సుజికి వాహనాల కొనుగోళ్లపై ఆఫర్లు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: విజయనగరంలోని వీటీ.అగ్రహారంలో ఉన్న వేణుగోపాల్ మోటార్స్‌లో వాహనాల కొనుగోళ్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇస్తున్నట్లు జనరల్ మేనేజర్ చిన్ని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రతి యాక్సెస్ కొనుగోలుపై రూ.3,500, బర్గ్‌మ్యాన్‌పై రూ.4,500 క్యాష్ బ్యాక్ ఉంటుందని చెప్పారు. ప్రతి ద్విచక్ర వాహనంపై రూ.20 వేల వరకు ప్రయోజనాలతో పాటు ఒక గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. పాత ద్విచక్ర వాహనాలను మార్చుకునే అవకాశం ఉందన్నారు.

విశాఖ-రాయపూర్ రైలు వేళల మార్పు

రైల్వే స్టేషన్ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: తూ.కో. రైల్వే జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ హామీమేరకు విశాఖ-రాయపూర్(08528) మధ్య నడిచే రైలు వేళలు ఈ నెల 20 నుంచి విశాఖలో ఉదయం 6.30కు బదులు ఉదయం 4.25 గంటలకు బయలుదేరేలా మార్చారు. 4.43 గంటలకు సింహాచలం, 5.05కు కొత్తవలస, 5.50కు విజయనగరం, 7.08కు బొబ్బిలి, 7.40కు పార్వతీపురం, 7.48కు పార్వతీపురం పట్టణం, 9.15 గంటలకు రాయగడ చేరుకోనుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రోదిస్తున్న తల్లిదండ్రులు


సాగర్ (పాతచిత్రం)

సీతానగరం, న్యూస్‌టుడే: సాంకేతిక విద్య పూర్తిచేసి కుటుంబానికి అండగా నిలుస్తాడని భావించిన కుమారుడి అకాల మరణంతో తల్లిదండ్రులు బోరుమన్నారు. సీతానగరం మండలంలో జరిగిన ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల మేరకు.. ఆర్.వెంకంపేట గ్రామానికి చెందిన ప్రభు, ధనలక్ష్మిల కుమారుడు వి.సాగర్ (20) ఐటీఐ పూర్తి చేసి వెల్డింగు దుకాణంలో పని చేస్తున్నాడు. మంగళవారం వెల్డింగు సామగ్రి కోసం ద్విచక్ర వాహనంపై సీతానగరం వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో పాచిపెంటకు చెందిన వై.బాలయ్య, బంగారుదొర మరో ద్విచక్రవాహనంపై సీతానగరం వెళ్తున్నారు. ఈ రెండు వాహనాలు చినభోగిల- కాశాపేట మధ్య పెట్రోల్ బంకు సమీపంలో ఢీకొన్నాయి. సాగర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న సాగర్ కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఎస్సై రాజేష్ కేసు నమోదు చేశారు.

రహదారి ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలైన ఘటన దత్తిరాజేరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఐ.రాజేష్ వివరాల మేరకు.. కోరప కృష్ణాపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం వెళ్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆటోలో ఉన్న కోరప కృష్ణాపురం గ్రామస్థులు ఎస్.వరహాలమ్మ, ఎస్.సత్యవతి, ఆర్.రాము, పి.కృష్ణమ్మ, సి.లక్ష్మి, తెర్లాం గ్రామానికి చెందిన కె.జితేంద్ర, కె.బంగారమ్మ, ఎం.రాము గాయపడ్డారు. వీరిని గజపతినగరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఎస్.వరహాలమ్మ, ఎస్.సత్యవతిని మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆటోను బైక్ ఢీకొని..

డెంకాడ, న్యూస్‌టుడే: లగేజీ ఆటోను ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం విజయనగరం నుంచి నాతవలస వెళ్లే రహదారిలో డెంకాడ పోలీస్‌స్టేషన్ ఎదురుగా చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పూసపాటిరేగ మండలం వెంపడాం గ్రామానికి చెందిన పి.గురునాయుడు, దుర్గారావు ద్విచక్రవాహనంపై విజయనగరం వైపు వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన లగేజీ ఆటోను బలంగా ఢీకొట్టారు. గురునాయుడు తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో విజయనగరం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. దుర్గారావు గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వల

నకిలీ కన్సల్టెన్సీ గుట్టురట్టు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ప్రైవేటు జాబ్ మేళా పేరుతో ఓ కన్సల్టెన్సీ సంస్థ ఎటువంటి కంపెనీలతో ఒప్పందం లేకుండానే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ పత్రాలతో మోసం చేయడానికి ప్రయత్నించింది. విజయనగరం, ఎస్.కోట, శ్రీకాకుళం, పార్వతీపురం గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులను ఉద్యోగం వచ్చిందని నమ్మించి ధ్రువపత్రాలు తీసుకుని నగదు కాజేసే ప్రయత్నం చేసింది. మంగళవారం ఉదయం విశాఖలోని దొండపర్తికి వచ్చిన ఆయా ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత గురించి తెలుసుకున్న ఎ.పి. నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ స్వయంగా వెళ్లి నిర్వాహకులతో మాట్లాడారు. ఉద్యోగాలకు సంబంధించి ఎటువంటి హామీ లేదని, అంతా ఉత్తుత్తిదేనని తెలుసుకుని నిరుద్యోగులకు తెలిపి మోసపోకుండా నిలువరించారు. నిరుద్యోగులకు వారి ధ్రువపత్రాల్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి జాబ్ మేళాకు ఒక తహసీల్దారును పర్యవేక్షణాధికారిగా నియమించాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నానని తెలిపారు.

జాతీయస్థాయిలో ప్రతిభ


ఉపాధ్యాయులతో కిల్లారి ఇందు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీర్‌లో గతనెల 30 నుంచి ఈనెల 4వ తేదీ వరకు జరిగిన 36వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో చీపురుపల్లి మండలం పెదనడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కిల్లారి ఇందు రెండు పతకాలను సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన జి.మహిధర్‌తో కలిసి స్వర్ణ పతకాన్ని, టీం విభాగంలో రజిత పతకాన్ని సాధించినట్లు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, పీడీ ఎం.రామారావు తెలిపారు.

తొలగని ఆటంకాలు.. పూర్తికాని నిర్మాణాలు

న్యూస్‌టుడే, చీపురుపల్లి


నిలిచిన కాంక్రీటు గోడ నిర్మాణ పనులు

20 నెలలుగా మూలుగుతున్న చీపురుపల్లి వంతెన పనులు

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాకు ప్రధాన మార్గమైన విజయనగరం - పాలకొండ రహదారిలో చీపురుపల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణాలకు ఆటంకాలు తొలగకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. పురాతన కాలంలో నిర్మించిన వంతెన శిథిలావస్థలకు చేరుకోవడంతో రెండున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. 2022 ఆగస్టు 16న వంతెన నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు నిధులు మంజూరు చేయడంతో.. గతేడాది మార్చిలో పనులను ప్రారంభించారు. 20 నెలలు గడుస్తున్నా.. పనులు పూర్తికాని దుస్థితి. దాంతో అత్యవసర సమయాల్లో ప్రజలు నానా యాతన పడాల్సివస్తోంది.

సర్వీసు రహదారి రగడ..

వంతెన నిర్మాణానికి సంబంధించి చీపురుపల్లి వైపు సిమెంట్ కాంక్రీటు పనులు జరుగుతుండగా.. గత నెల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీతో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు మార్గం ఉండదని, సర్వీసు రహదారి సదుపాయం కల్పించాలంటూ ఆందోళన వ్యక్తం చేయడంతో పనులు నిలిపేశారు. సర్వీసు రహదారి సదుపాయం కల్పించడానికి.. రోడ్డుకు ఆనుకుని ఉన్న దుకాణాలను కొంత వరకు కొట్టాల్సిఉందని అధికారులు అంటున్నారు. ర.భ, రైల్వే అధికారులు కొద్ది రోజుల కిందట పరిశీలించి మార్కింగ్ ఇచ్చారు. తొలగించాలని యజమానులకు సూచించారు. వంతెనకు సంబంధించి మిగతా పనులు జరుగుతున్నా.. కీలకమైన కాంక్రీట్ గోడ నిర్మాణం నిలిచిపోవడంతో దీని ప్రభావం మొత్తం పనిపై పడే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తాం..

ఆర్వోబీ నిర్మాణ పనులు చురుగ్గా జరిగేలా చూస్తాం. సర్వీసు రహదారి నిర్మాణానికి దుకాణాలను కొంతవరకు తొలగించాలని యజమానులకు ర.భ. అధికారులు, గుత్తేదారుని ప్రతినిధులు సూచించారు. ర.భ. డీఈ సమక్షంలో తాము పనులు చేయిస్తామని గుత్తేదారుడు అంటున్నారు. డీఈతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తాం. – ఎల్.దామోదరరావు, ఎస్సై, చీపురుపల్లి

ఉపాధ్యాయులపై భారం తగ్గించాలి

ఏపీటీఎఫ్ ప్రతినిధుల సభలో వక్తలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: భవిష్యత్తులో శాశ్వత ప్రాతిపదికనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, ప్రస్తుతమున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పేర్కొన్నారు. విజయనగరంలో మూడు రోజుల పాటు జరిగిన ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత బోధనకు అవకాశం కల్పించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించి, మరుగుదొడ్ల చిత్రీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రస్తుతమున్న 48 పీరియడ్లను 32కు కుదించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్ల ప్రయోజనాల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పురపాలక ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలు, ఇతరత్రా అంశాల్లో సంఘాలతో చర్చించి పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, ఉప కమిటీ సభ్యులు 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హృదయరాజు

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

పోలమ్మ తిరువీధి ఉత్సవం

రాజాం, న్యూస్‌టుడే: రాజాం గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బురదల పోలమ్మ అమ్మవారి ఘటానికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో అమ్మవారి ఘటాన్ని భక్తులు దర్శించుకున్నారు. ముగ్రాటలతో మొక్కులు చెల్లించి, కానుకలు సమర్పించారు. తిరువీధి ఉత్సవం ప్రశాంతంగా కొనసాగేలా సీఐ కె.అశోక్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమ్మవారి ఘటాన్ని దర్శించుకుంటున్న భక్తులు

'ప్రతి సమస్యను పరిష్కరిస్తా'

ప్రజాదర్బార్‌లో 129 వినతులు అందజేత


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. రామభద్రపురం మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు ఐదేళ్లుగా ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్నారని, వాటి పరిష్కారాలపై దృష్టి పెట్టామని చెప్పారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి 129 మంది ఎమ్మెల్యేకు దరఖాస్తులు అందించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ భూముల కబ్జా తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. అధికారులు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి పరిష్కరించాలని, పెద్ద సమస్యలైతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి సి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, మండలాధ్యక్షుడు కె.భాస్కరరావు, కె.తిరుపతిరావు, కె.శంకరరావు, ప్రత్యేక అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


తన కాళ్లు కదలవని, పింఛను మొత్తాన్ని పెంచాలని కోరుతూ కుటుంబ సభ్యుల సహాయంతో వచ్చిన దివ్యాంగుడు

బాధితులకు చెక్కు అందజేత

రామభద్రపురం: మండలంలోని మామిడివలస గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త నడుపూరి చిన్నంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పార్టీ నుంచి వచ్చిన రూ.2లక్షలు చెక్కును ఎమ్మెల్యే బేబినాయన అందించారు.

బాల్యవివాహాల అడ్డుకట్ట అందరి బాధ్యత

రాజాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఎల్, ప్రొహిబిషన్ అధికారిణి జయ పేర్కొన్నారు. రాజాం ఐసీడీఎస్ కార్యాలయంలో బాల్యవివాహాల నియంత్రణపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ కార్యకర్తలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పీవో టి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి	80085 74367
గజపతినగరం	80085 74332
రాజాం	80085 74308
గరివిడి	80085 74348

? రావివలస అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లో చేరిన మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. - స్థానికులు

● తక్షణమే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి మురుగు లేకుండా చూస్తాం. - భానోజీరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? మామిడిపల్లి మూడవ వీధిలో కాలువల్లో పనికిరాని మొక్కలు పెరగడంతో మురుగు పారడం లేదు. - స్థానికులు

● మొక్కలను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. - వెంకటరమణ, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, రామభద్రపురం

? చినమానాపురం మీదుగా గొడియాడ వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగి, ఇబ్బందులు పడుతున్నాం. - ప్రయాణికులు

● తక్షణమే పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తాం. - నందకుమార్, ఏఈ

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

నీటి సరఫరా పునరుద్ధరణ

స్పందనకు వందనం

మెంటాడ, న్యూస్‌టుడే: గత కొద్దిరోజులుగా మెంటాడలో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. రెండు రోజుల నుంచి గ్రామంలో తాగునీరు సరఫరా కావడంలేదని ఈనాడు 'మేమున్నాం-మీకుతోడుగా'లో ప్రచురితమైన వార్తకు కార్యదర్శి రామ్‌నాథ్, సర్పంచి గెడ్డ రాంబాబు స్పందించారు. పైపులైను బాగు చేయించారు.

పల్లె పండగ.. అభివృద్ధి నిండుగా..

ఈనెల 14 నుంచి పనులకు శంకుస్థాపనలు

న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

పల్లె రహదారులకు మోక్షం కలిగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు 'పల్లె పండగ' పేరుతో భారీ ఎత్తున పనుల ప్రారంభానికి శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. గ్రామాల్లో సిమెంటు రహదారులు, కాలువలు, కల్వర్టులు తదితర పనులకు శ్రీకారం చుట్టనున్నారు.


సిమెంటు కాలువల నిర్మాణంతో ఇలాంటి ప్రాంతాలకు మోక్షం కలగనుంది

నియోజకవర్గం	మంజూరు చేసిన పనులు	కేటాయించిన నిధులు (రూ.లక్షల్లో)
బొబ్బిలి	402	2,654.51
గజపతినగరం	156	2,255.95
రాజాం	403	2,131.18
చీపురుపల్లి	263	1,614.71

● గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కూడా సక్రమంగా వినియోగించకుండా ఖాతాల్లో నుంచి లాగేసుకుంది. దీంతో అభివృద్ధి పనులే కాదు.. కాలువల్లో పూడిక తీసే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులకు ఉపాధిహామీ నిధులు మంజూరు చేసింది. దీంతో మట్టి రహదారులన్నీ సిమెంటు రోడ్లు, మట్టి కాలువలు సిమెంటు డ్రైన్లు కానున్నాయి. కల్వర్టుతో దిగువ ప్రాంతాలకు ఊరట కలగనుంది.

1,224 పనులకు..

ప్రతి పంచాయతీకి రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు కేటాయించారు. ప్రతిపాదనలు పంపించిన వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం విశేషం. దీంతో స్థానిక ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని 17 మండలాల్లో 1,224 అభివృద్ధి పనులకు మొత్తం రూ.8,656.35 లక్షలు మంజూరు చేశారు.

ప్రారంభానికి చర్యలు

ఉపాధి పథకంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 14 నుంచి జరగనున్న 'పల్లె పండగ'లో శంకుస్థాపనలు చేపట్టి వేగంగా పూర్తి చేస్తాం. అందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సిమెంటు రహదారులు, కాలువలకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. – సి.హెచ్.వి. అప్పారావు, డీఈ బొబ్బిలి డివిజన్

నిర్వహణ లేక మూలకు..!

మండల కేంద్రం దత్తిరాజేరులోని వ్యవసాయ గిడ్డంగి గత అయిదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. ఈ గిడ్డంగిలో గతంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ ఉంచి రైతులకు అవసరమైనప్పుడు పంపిణీ చేసేవారు. గిడ్డంగి పైభాగంలో మండల వ్యవసాయ కార్యాలయం ఉండేది. అయితే గిడ్డంగిని సిబ్బంది ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. చుట్టూ పొదలు, తుప్పలు పెరిగిపోయాయి. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఇన్‌ఛార్జి ఏవో గోవిందమ్మ అన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు



దేవస్థానం రహదారిలో అంధకారం



చీపురుపల్లిలోని శ్రీకాకుళం ప్రధాన రహదారిలో రావివలస కూడలి నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ప్రవేశ మార్గం వరకు ఉన్న వీధి దీపాలు మరమ్మతులకు గురై వెలగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా రోజులుగా సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యను ఈవో వై. ఝాన్సీరాణి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే కొత్త దీపాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, చీపురుపల్లి

వంతెన నిర్మాణానికి అడుగులు



భోజరాజపురం వద్ద వేగావతి నదిపై వంతెన పనులు తిరిగి మొదలయ్యాయి. 2020లో దీనికి శంకుస్థాపన చేశారు. కొంతవరకు పనులు చేసిన తరువాత బిల్లులు రాక గుత్తేదారుడు నిలిపేశారు. ఫలితంగా గ్రామస్థులు నదిలో రాకపోకలకు ఇబ్బందులుపడ్డారు. వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలకు ఆగిన పనులు కూటమి ప్రభుత్వం రాగానే చేపట్టారు. ఏపీఆర్ఆర్‌పీ పథకంలో రూ.15.06 కోట్లు మంజూరు చేశారు. వంతెన అనుసంధానంగా గొర్లెసీతారాంపురం కూడలి నుంచి తారురోడ్డు నిర్మించనున్నారు. ప్రస్తుతం స్తంభాల పనులు జరుగుతున్నాయని ఏఈ నాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

ప్రవాహానికి తప్పని అడ్డంకి



మద్దువలస కుడి ప్రధాన కాలువలో గుర్రపుడెక్క, ఇతర పనికి రాని మొక్కలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. తూముల వద్ద ఇవి అడ్డుపడుతున్నాయని, దీంతో ప్రవాహ వేగం తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. కనీసం తూములు, షట్టర్లు ఉన్న చోట వీటిని తొలగించాలని కోరుతున్నారు. నిధుల కోసం ఇప్పటికే ప్రతిపాదించామని డీఈ నాగేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు చెప్పారు. – న్యూస్‌టుడే, రేగిడి

పైరుపై తెగుళ్ల దాడి

సంతకవిటి, న్యూస్‌టుడే: వ్యవసాయ సాగులో రైతులకు కష్టాలు తప్పడం లేదు. పొలంలో వేసిన నాట్లు నుంచి సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు పంటపై ఆకుముడత, సుడిదోమ, పీకపురుగులు తెగుళ్లు ఆశించాయి. దీంతో రైతులు పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. అధికారుల సూచనలు మేరకు పురుగు మందు చల్లాలని ఏవో నవీన్ తెలిపారు.


పురుగుల మందు పిచికారీ

సరకులు సజావుగా పంపించాలి

తెర్లాం, న్యూస్‌టుడే: సరకుల తూకాల్లో తేడాలు లేకుండా గోదాముల నుంచి చౌకధరల దుకాణాలకు సజావుగా పంపించాలని ఆర్డీవో వీఎస్ఎస్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక పౌర సరఫరాల గోదామును తనిఖీ చేశారు. గోదాము నుంచి దుకాణాలకు వెళ్లిన సరకులు, నిల్వ వివరాలు తెలుసుకున్నారు. తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గోదాము ఇన్‌ఛార్జి, ఉప తహసీల్దారు సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా అమ్మితే చర్యలు

తెర్లాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అక్రమంగా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ బి. సాగర్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సోమవారం రాత్రి రంగప్పవలస గ్రామం సమీపంలో ఓ వ్యక్తి వద్ద నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా చేసే వ్యక్తులపై దృష్టి సారించామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

'విధుల నుంచి తొలగిస్తాం'


ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

బొబ్బిలి, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తొలగిస్తామని కమిషనర్ రామలక్ష్మి హెచ్చరించారు. తన కార్యాలయంలో ఉద్యోగులతో సమీక్షించారు. రహదారులు, కాలువల వద్ద పూడికలు ఉంటే ఊరుకునేది లేదన్నారు. బహుళ అంతస్తుల భవనాల్లో సేంద్రియ ఎరువు తయారీ, కూరగాయల పెంపకంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు.

కారుణ్య చేయూత

బొబ్బిలి, న్యూస్‌టుడే: పట్టణం సింగారపువీధికి చెందిన ఎం. సీతమ్మ ఏడాదిగా అనారోగ్యంతో మంచం పట్టింది. కుడి బుగ్గలో కాయ(ట్యూమర్) రావడంతో బాధ పడుతోంది. ఈమెకు భర్త, కుమారులు లేరు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసింది. సీతమ్మ విషయం తెలుసుకున్న రోటరీ క్లబ్, కారుణ్య స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జేసీ రాజు ఇటీవల ఆమెను విశాఖ ఆసుపత్రిలో చేర్పించారు. మందుల కోసం రూ.20 వేలు అందించారు.

నల్లమందుతో వ్యక్తి అరెస్టు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురంలోని ఓ డాబాలో 78 గ్రాముల నల్లమందుతో రాజేష్ చౌదరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వై.ప్రసాదరావు తెలిపారు. రాజస్థాన్ నుంచి నల్లమందు తీసుకువచ్చి లారీ చోదకులకు అమ్ముతున్నట్లు చెప్పారు.


ఫోక్సో కేసుపై దర్యాప్తు

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో గత ఏడాది నమోదైన ఫోక్సో కేసుకి సంబంధించి డీఎస్పీ శ్రీనివాస్ మంగళవారం దర్యాప్తు నిర్వహించారు. జైల్లో ఉన్న నిందితుడిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకున్నామని, ఈ కేసును డీఎస్పీ విచారిస్తున్నారని ఇన్‌ఛార్జి ఎస్ఐ రాజేష్ తెలిపారు.

తాగునీరు రాదు.. కాలువలు లేవు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రంగరాయపురంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం గ్రామంలో సీపీఎం మహాసభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న స్థానికులు కాలువలు లేవని, తాగునీరు సక్రమంగా రావడం లేదని ప్రస్తావించారు. పారాది కాలువ ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు రెడ్డి త్రినాథరావు, గోపాల్, శంకరరావు మాటిచ్చారు.

పూజించి.. పులకించి..


చీపురుపల్లి మానసాదేవి


గరివిడి మండలం కోనూరులో సామూహిక కుంకుమ పూజలు


అలజంగి ఆలయానికి కలశాలతో చేరుకున్న మహిళలు


వంగర: మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి


చీపురుపల్లి కనకమహాలక్ష్మి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గరివిడి మండలం కోనూరు శ్రీదుర్గా, లక్ష్మి, బంగారుతల్లి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. చీపురుపల్లిలో కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో చండీ హోమం నిర్వహించారు. మెంటాడ ఆలయంలో కనకదుర్గమ్మను కరెన్సీ నోట్లతో అలంకరించారు.

– న్యూస్‌టుడే, గరివిడి, చీపురుపల్లి, గ్రామీణం, మెంటాడ, బొబ్బిలి గ్రామీణం,

ప్రత్యేకాధికారిగా ప్రశాంత్‌కుమార్



రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండల ప్రత్యేక అధికారిగా **జి.ప్రశాంత్‌కుమార్‌ను** ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేసిన గోవిందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రశాంత్‌కుమార్ మంగళవారం మండల పరిషత్తు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న తారకరామారావు

గంట్యాడ గ్రామీణం, రాజాం, బొబ్బిలి గ్రామీణం, గుర్ల, న్యూస్‌టుడే: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి, అధిక దిగుబడులు సాధించడమే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం లక్ష్యమని జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు అన్నారు. గంట్యాడ మండలం బోనంగి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆధునిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువగా పంటలు పండించొచ్చన్నారు. యంత్రాలను వినియోగించడంతో తక్కువ కాలంలో దిగుబడులు సాధించొచ్చన్నారు. ఏవో శ్యాంకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాజాం మండలం పెనుబాక, బొద్దాం గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.చంద్రరావు రైతులకు సూచనలు చేశారు. బొబ్బిలి మండలం కలవరాయి, చింతాడ గ్రామాల్లో ఏడీఏ శ్యామ్‌సుందర్, గుర్లలోని గుజ్జంగివలసలో ఏవో తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

చిన్నారుల ఎదుగుదలపై దృష్టి

గంట్యాడ, న్యూస్‌టుడే: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల శారీరక ఎదుగుదలపై దృష్టి సారించాలని, లబ్ధిదారులకు అందుతున్న పౌష్టికాహార ఫలితాలను తెలిపేది అదేనని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టరు బి.శాంతకుమారి స్పష్టం చేశారు. కొటారుబిల్లి తితిదే కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన గంట్యాడ ప్రాజెక్టు సమావేశంలో మాట్లాడారు. పిల్లల గ్రోత్ మానిటరింగ్ కీలకమైందన్నారు. విజయనగరం ఉత్సవాల్లో అంగన్వాడీల పనితీరును తెలిపేలా ఏర్పాటు చేయనున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని, పోషక విలువలు పెంచే ఆహార పదార్థాలను జిల్లా వాసులకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంట్యాడ సీడీపీవో డి.ఉమాభారతి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న పీడీ శాంతకుమారి

ఆడపిల్లలకు అవగాహన కల్పించండి


సిబ్బందికి సూచనలిస్తున్న సుబ్రహ్మణ్యం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య సేవలు అందించడంతోపాటు ఆడపిల్లలకు పోషకాహారం, హింసను ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలను తెలియజేయాలని ఆర్‌కేఎస్‌కే ప్రోగ్రాం అధికారి వీవీబీ సుబ్రహ్మణ్యం సూచించారు. ఆరోగ్య శాఖ, నేచర్ స్వచ్ఛంద సంస్థ, యునిసెఫ్ సంయుక్తంగా నిర్వహించిన సఖి కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌వోలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. టెలీ మెడిసన్ గురించి అవగాహన కల్పించారు. టీనేజర్ల గర్భధారణ, రక్తహీనత, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై విజయనగరం ఉపాధ్యాయ శిక్షణ కళాశాల అధ్యాపకుడు రవికుమార్ వివరించారు. ఎంపీడీవో రవికుమార్, నేచర్ బృంద సభ్యులు నిశిత, సుభాష్, కృష్ణ, ప్రసాద్, చైతన్య, బంగారుబాబు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

బొబ్బిలి, న్యూస్‌టుడే: హెచ్ఐవీ ఎయిడ్స్‌ను తిరిమికొట్టాల్సిన అవసరం ఉందని యువత అభివృద్ధి సంస్థ, టీబీ యూనిట్ ప్రతినిధులు గోపాల్, నాగరాజు అన్నారు. మంగళవారం బొబ్బిలి ఎన్జీవో హోంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై స్థానికులకు అవగాహన కల్పించారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో ఎయిడ్స్ రోగులతో కలిసి జీవించొచ్చన్నారు. చిన్నచూపునకు గురవుతున్న బాధితులు 1097 నంబరుకు ఫోన్ చేస్తే.. తగు సహాయం అందిస్తారన్నారు.

అధికారికి అభినందనలు

గంట్యాడ: జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటేశ్వరరావును పంచాయతీ కార్యదర్శుల జిల్లా సంఘం నాయకులు జడ్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. జిల్లా సంఘ నాయకులు రమణ, తవుడు, అప్పలనాయుడు, భవాని, వహీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

బొబ్బిలి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం 'మన వాట్సాప్' బృంద సభ్యులు ఇచ్చిన విరాళం రూ.10 వేలను ఎమ్మెల్యే బేబినాయనకు మంగళవారం అందజేశారు.

నాటి నిర్లక్ష్యం.. నేటికీ అసంపూర్ణం

నిలిచిపోయిన సచివాలయాల నిర్మాణాలు

గత పాలకులు మిగిల్చిన అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంతో నియోజకవర్గం మొత్తం మీద చాలాచోట్ల సచివాలయ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో పాత పంచాయతీ భవనాలు, అద్దె ఇళ్లలో నడుపుతున్నారు. ప్రజాధనం వృథా కాకుండా కూటమి ప్రభుత్వం వీటిని పూర్తి చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సంతకవిటి, వంగర, రాజాం గ్రామీణం



ఇదీ పరిస్థితి

సంతకవిటి మండలంలోని హొంజారం, చిత్తారపురం, గోళ్లవలస, తలతంపర, మండవకురిటి, తమరాంలో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ● వంగర మండలం వీవీఆర్ పేట, శ్రీహరినాపురం, కోనంగిపాడు, కింజంగి, వంగర, మద్దువలస, బాగంపేట, కొప్పర, రాజులగుమ్మడ, శివ్వాంల, రాజాం మండలంలో ఒమ్మి, పొగిరి, శ్యామ్‌పురం, కంచరాం, ఎంజీ వలస, దోసరిలలో భవనాల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి.

మండలం	పంచాయతీలు	మొత్తం సచివాలయాలు	పనులు పూర్తైనవి	పూర్తికానివి
సంతకవిటి	34	24	18	06
వంగర	27	19	07	12
రాజాం	20	17	09	08

పూర్తి చేస్తాం

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సచివాలయాల భవనాల పనులు చేపట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారటంతో కొన్ని చోట్ల నిర్మాణాలు నిలిచాయి. బిల్లు చెల్లింపుతో పాటు, అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – జయప్రకాశ్, పంచాయతీరాజ్ డీఈఈ

ప్రకటన

నా క్లయింట్లు అయిన విజయనగరం జిల్లా, బొబ్బిలి మునిసిపాలిటిలో చేరివున్న గొల్లపల్లి గ్రామ వాస్తవ్యులు 1) యాండ్రాపు వెంకట గోపాలకృష్ణ లక్ష్మినారాయణ, S/o లేటు కూర్మినాయుడు, 2) యాండ్రాపు లీలావతి, W/o. వెంకట గోపాలకృష్ణ లక్ష్మినారాయణ ఇచ్చిన భోగట్టా అధికారమును బట్టి యావన్మందికు తెలియపరిచే ఉద్దేశ్యంతో ఈ ప్రకటన జారీ చేయడమైనది.

నా క్లయింట్లకు యాండ్రాపు సంతోష్ అను కుమారుడు నేటికి జీవిస్తూ కలడు. నా క్లయింట్లకు పై గొల్లపల్లి గ్రామమునందు మరికొన్ని ప్రదేశముల యందు నివాస గృహములు, వ్యవసాయ యోగ్యమైన మెట్టు, పల్లపు భూములు, ఇండ్ల స్థలములు వగైరా ఆస్తులు కలవు. నా మొదటి క్లయింట్ కిరాణా వ్యాపారము కూడా చేసుకొనుచున్నాడు. సదరు వ్యాపారం నా మొదటి క్లయింట్ అతని సొంత ద్రవ్యముతో చేస్తూ ఉన్నాడు. సదరు ఆస్తులు మా క్లయింట్ల యొక్క సొంత ఆస్తులు అయి ఉన్నవి. సదరు ఆస్తులుపై నా క్లయింట్లకు మినహా ఏ ఒక్కరికి ఏ విధమైన హక్కులు లేవు. ఇట్లుండగా పైన చెప్పబడిన నా క్లయింట్ల యొక్క కుమారుడు సదరు సంతోష్ యొక్క అప్పులు వ్యవహారములుతో నా క్లయింట్లు ఎవ్విధమైన సంబంధము, బాధ్యత లేదని నా క్లయింట్లకు గాని, వారి ఆస్తులకు గాని, మొదటి క్లయింట్లు చేయుచున్న కిరాణా వ్యాపారమునకు గాని బంధించదగినవి కావు. సదరు సంతోష్‌కు మా క్లయింట్ల యొక్క కుటుంబముతో గాని వ్యవహారములతో గాని ఎవ్విధమైన సంబంధము లేదు. నా క్లయింట్ల యొక్క కుటుంబమునకు ఎవ్విధమైన ఉపయోగపడే పనులు సదరు సంతోష్ చేయలేదు, చేయనవసరం లేదు. గాన ప్రజలెల్లరకు తెలియచేయడమైనది. ఇందుకు అతిక్రమించి మా క్లయింట్లకు గాని వారి ఆస్తులుకు గాని ఎవ్వరు భంగము కలిగించిన తగు న్యాయపరమైన చర్యలు తీసుకొనబడును.

బొబ్బిలి,
తేది: 08.10.2024.

పెదపెంకి వెంకట శివ ప్రసాద్
అడ్వకేట్, బొబ్బిలి-535 558

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

? భోగాపురం- చాకివలస రోడ్డులో మొక్కలు పెరిగి.. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. - **రాధామణి, స్థానికులు**

● తక్షణమే సమస్యను పరిష్కరిస్తాం. - **గాయత్రి, ఈవోపీఆర్డీ - భోగాపురం**

? ఉడాకాలనీ ఫేజ్-2లో నాలుగు నెలలు నుంచి రెండ్రోజులకు ఒకసారి రంగామారిన నీరు సరఫరా చేస్తున్నారు. - **లాలాలజపతిరాయ్, స్థానికుడు**

● పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **పి.నల్లనయ్య, కమిషనరు నగర పాలక సంస్థ**

? రింగ్‌రోడ్డు హెబ్రాన్ పాఠశాల పక్కన అపరిశుభ్రంగా తయారైంది. - **స్థానికులు**

● సిబ్బందిని పంపించి, చర్యలు తీసుకుంటాం. - **సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి**

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నేడు సామూహిక అక్షరాభ్యాసాలు

విజయనగరం కంటోన్మెంట్: రింగురోడ్డు జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శ్రీధర్, జి.శ్రీనివాసరావు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూలానక్షత్రం రోజున సుమారు 5వేల మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరగనున్నాయని పేర్కొన్నారు.

జాతరకు యుద్ధ ప్రాతిపదికన పనులు


రహదారికి మరమ్మతులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఈనెల 15న జరగనున్న పైడితల్లమ్మ సిరిమాను జాతర మహోత్సవానికి నగరపాలక సంస్థ తరఫున అన్ని సౌకర్యాలు యుద్ధప్రాతిపదికన కల్పిస్తున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. రూ.1.20 కోట్లతో బీటీ, వివిధ రహదారుల మరమ్మతు పనులతో పాటు విభాగినులకు రంగులు వేయిస్తున్నామన్నారు. ప్రసాదాల పంపిణీకి షేడ్ పేట్లు, విస్తరాకుల వినియోగించాలన్నారు. సిరిమానోత్సవం సందర్భంగా 430 మంది అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించినట్లు చెప్పారు.

శాశ్వత వలసదారులను తొలగించాలి


జేసీకు వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: సచివాలయాల వారీగా వలస వెళ్లినవారు, చనిపోయిన వారి కార్డులను భౌతికంగా గుర్తించి వారిని మ్యాపింగ్ జాబితా నుంచి తప్పించాలని ఆంధ్రప్రదేశ్ చౌక దుకాణాల డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రామారావు, అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్డులు రేషనలైజేషన్ చేయకుండా దుకాణాలను వేరుచేసి, కొత్తవి ఏర్పాటు చేయడం సరికాదని వివరించారు. పునర్ వ్యవస్థీకరణ చేసిన తరువాత ప్రక్రియ చేపట్టాలని కోరారు. సంఘం కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

నగర ఉద్యానం.. అంతా అధ్వానం

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న రెండు ఉద్యానాలు అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. 2015లో తెదేపా హయాంలో వీటి అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. దానికితోడు రెండు చోట్ల రూ.7 లక్షలతో వ్యాయామ సామగ్రి కొనుగోలు చేశారు. వాటిని ఏర్పాటు చేసేందుకు రూ.2 లక్షలు కేటాయించారు. తర్వాత వచ్చిన వైకాపా పాలకులు ఎలాంటి పనులు చేయకుండా వదిలేశారు. దాంతో పందులు, శునకాలు స్వైరవిహారం పెరిగింది. నగర వాసులకు ఆహ్లాదకర వాతారవణం దూరమైంది.


నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరుపయోగంగా వ్యాయామ సామగ్రి

ఉద్యానాల్లో నడక దారి, పూల మొక్కలు, క్రీడామైదానం, వ్యాయామశాల వంటి మౌలిక సదుపాయాలు కల్పించడానికి గత తెదేపా హయాంలోనే నిధులు మంజూరు చేశారు. అయినప్పటికీ 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వ్యాయామ సామగ్రిని చాలా ఏళ్ల పాటు ఆరుబయటే వదిలేయడంతో తుప్పుపట్టాయి. యువత, చిన్నారులు, వృద్ధులు వ్యాయామానికి దూరమయ్యారు.


అభివృద్ధికి నోచుకోని గాంధీనగర్ కాలనీ ఉద్యానవనం

చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నాం..

ఉద్యానాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో చాలాకాలంగా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం వ్యాయామ సామగ్రి ఏర్పాటు చేసేందుకు కూడా ప్రయత్నించలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై దృష్టి సారించాలి.

- డీవీ.ప్రసాద్, గాంధీనగర్ కాలనీ

టెండర్లు పిలిచాం..

రెండు ఉద్యానవనాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. రూ.20 లక్షలతో పనులు చేసేందుకు టెండర్లు పిలిచాం. సదరు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. మళ్లీ టెండర్లు పిలిచేందుకు చర్యలు చేపడుతున్నాం. త్వరలో పనులు చేసేలా తీసుకుంటాం.

- త్రినాథరావు, ఏఈ, నెల్లిమర్ల నగర పంచాయతీ

మహాలక్ష్మి.. నమోస్తుతే


మహాలక్ష్మీదేవిగా పైడితల్లి వనంగుడిలోని దుర్గాదేవి


పసుపు కొమ్ముల అలంకరణలో గాజులరేగ దుర్గమ్మ


జామి: కరెన్సీ నోట్లతో అలంకరణ


పెదతాడివాడలో ఆకట్టుకుంటున్న దుర్గాదేవి మండపం


అన్నమరాజుపేటలో చండీయాగంలో పాల్గొన్న భక్తులు

దేవీ నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. నగరంలో అత్యంత భక్తిశ్రద్ధల నడుమ చేపడుతున్నారు. పైడితల్లి అమ్మవారి వనంగుడిలో వేంచేసిన దుర్గాలమ్మవారు మహాలక్ష్మీదేవిగా, గాజులరేగ కొండపల్లివారితోట దుర్గాలమ్మ పసుపు కొమ్ముల అలంకరణలో కాత్యాయినీదేవిగా దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్, డెంకాడ, జామి

తపాలా సేవలపై అవగాహన అవసరం

విజయనగరం కోట, న్యూస్‌టుడే: తపాలాశాఖ సేవలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఆ శాఖ పర్యవేక్షకుడు కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తపాలాశాఖ వారోత్సవాల్లో భాగంగా ఫిలాటలీ దినం నిర్వహించారు. క్విజ్ పోటీ చేపట్టి విజేతలకు బహుమతులు అందజేశారు.

సినిమా అవకాశాల పేరుతో వసూళ్లు

మద్దిపాడు, న్యూస్‌టుడే: సినిమా అవకాశాలు ఇస్తామని పలువురి నుంచి రూ.లక్షలు వసూలు చేసిన ఇద్దరిని ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరానికి చెందిన ఓ యువతి నుంచి రూ.9 లక్షలను నిందితులు వసూలు చేశారు. వారిని సీతారామపురం వద్ద అరెస్టు చేశామని సీఐ శ్రీకాంత్ బాబు తెలిపారు.

ప్రజాదర్బార్‌లో 314 అర్జీలు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజల వద్దకు వచ్చి వినతులు తీసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం స్థానిక బొడ్డువారి కూడలి వద్దనున్న కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం వద్ద నగర పాలక సంస్థ పరిధిలోని 16 నుంచి 30 డివిజన్లకు ప్రజాదర్బార్ నిర్వహించారు. మొత్తం 314 వినతులు స్వీకరించారు. పింఛన్లు, గృహాలు, రహదారులు, కాలువల సమస్యపైనే ఎక్కువగా ఉన్నాయి. ప్రజల నుంచి తీసుకున్న అన్ని వినతులను పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎంటీఎస్ (1998 డీఎస్సీ) ఉపాధ్యాయులు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగాలిచ్చిన అనతి కాలంలోనే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందన్నారు. ఉన్నవారిని క్రమబద్ధీకరించాలని, కోరారు. వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, పింఛను సదుపాయం కల్పించాలన్నారు. ఆ సంఘం నాయకులు పి.వెంకటరావు, ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వైమానిక దళం సేవలు అమూల్యం


కేకు కోస్తున్న ప్రిన్సిపల్ ఎస్.ఎస్.శాస్త్రి, విద్యార్థులు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: దేశ గగనతలాన్ని రక్షించడంలో వైమానిక దళం సేవలు అమ్యూలమైనవని కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి అన్నారు. మంగళవారం సైనిక్ స్కూల్‌లో వైమానిక దళ దినోత్సవం నిర్వహించారు. 1971 ఇండోపాక్ యుద్ధంలో ప్రాణాలు అర్పించిన పరమ వీరచక్ర నిర్మల్‌జిత్ సింగ్ సెఖోన్ త్యాగాన్ని ప్రతి విద్యార్థి స్మరించాలని సహాయ ప్రిన్సిపల్ వింగ్ కమాండర్ కిరణ్ కోరారు. ఎయిర్‌వింగ్ ఏఎన్‌వో డా.కె.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత జిల్లాగా నిలపాలి

జామి, న్యూస్‌టుడే: అలమండ పీహెచ్‌సీని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.భాస్కరరావు పరిశీలించారు. పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు రహిత జిల్లాగా నిలపడానికి ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కుష్ఠు లక్షణాలు ఉంటే యాప్‌లో నమోదు చేయాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత గురించి క్షేత్రస్థాయిలో తెలియపర్చాలన్నారు. స్థానిక వైద్యాధికారిణి శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

బదిలీ అయిన కార్యదర్శులు రిలీవ్

కొత్తవలస, న్యూస్‌టుడే: మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీ అవడంతో మంగళవారం వారిని విధుల నుంచి రిలీవ్ చేసినట్లు ఎంపీడీవో ఎస్.రమణయ్య చెప్పారు. శ్రీదేవి కొత్తవలస ఈఓపీఆర్డీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఉత్తమ చోదకులుగా గుర్తింపు తెచ్చుకోవాలి

విజయనగరం కోట, న్యూస్‌టుడే: పెద్ద వాహనాలు నడపడంపై శిక్షణ పొందిన చోదకులు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఉత్తమ చోదకులుగా గుర్తింపు పొందాలని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనారాయణ అన్నారు. మంగళవారం భారీ వాహనాల నడపడంపై ఆర్టీసీ శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తిచేసుకున్న 18వ బ్యాచ్ చోదకులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 19వ బ్యాచ్‌కు మరో వారం రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని విజయనగరం డిపో ప్రబంధకులు జె.శ్రీనివాసరావు తెలిపారు. లైట్ మోటారు వెహికల్ నడపడంలో ఏడాది పాటు అనుభవం ఉండి, వయసు 21 ఏళ్లు నిండినవారు శిక్షణకు అర్హులన్నారు. 40 రోజులపాటు శిక్షణ ఉంటుందని, వివరాలకు డ్రైవింగ్ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ డీఎన్ రాజు, 73829 24030, 98666 49336 నంబర్లను సంప్రదించాలన్నారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగర పరిధిలోని వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సు కలిగి ఉండాలని ప్రజారోగ్య అధికారి డా.కె.సాంబమూర్తి అన్నారు. మంగళవారం ఉల్లివీధిలోని వాణిజ్య భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటికే లైసెన్సు ఉంటే నవీకరించుకోవాలన్నారు. వాణిజ్య మండలి అధ్యక్ష, కార్యదర్శులు కాపుగంటి ప్రకాశ్, రవ్వా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ కార్యదర్శుల తీరుపై నిరసన


నిరసన తెలియజేస్తున్న అధికారులు, సిబ్బంది

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ కమిషనరు నల్లనయ్య పట్ల వార్డు సచివాలయ కార్యదర్శుల తీరును ఖండిస్తున్నామని అధికారులు, ఉద్యోగులు పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. 5న పన్నుల వసూళ్ల ప్రగతిపై సమీక్షించి, వెనుకబడిన వారి నుంచి కమిషనరు వివరణ అడిగారని, ఎవర్నీ కించపర్చలేదన్నారు. అనారోగ్య కారణాలతో కార్యదర్శి కళ్లు తిరిగి పడితే కమిషనరు స్పందించి ఆసుపత్రిలో చేర్పించారన్నారు. వాస్తవాలకు భిన్నంగా జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేయడం శోచనీయమన్నారు.

కర్మాగారం ముందు కార్మికుల ఆందోళన


కార్మికులతో మాట్లాడుతున్న పోలీసులు

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: రెల్లిగైరమ్మపేట పంచాయతీ పరిధిలోని మా మహామాయ కర్మాగారంలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులను పనులకు రావొద్దని చెప్పడంతో మంగళవారం గేటు బయట నిరసన తెలిపారు. సీఐ ఘటనా స్థలానికి చేరుకొని యాజమాన్య ప్రతినిధులు, కార్మికులతో మాట్లాడారు. తొలగించిన నలుగురు మహిళలకు, 58 ఏళ్లు పూర్తయిన వారి కుటుంబ సభ్యులకు కర్మాగారంలో పనులు కల్పించడానికి హెచ్‌ఆర్ మేనేజరు మురళీ తదితరుల సమక్షంలో అంగీకారం కుదిరిందని సీఐ తెలిపారు.

బంగారు వస్తువును కాజేసిన నిందితుల అరెస్ట్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: మహిళను కత్తితో బెదిరించి 9 తులాల బంగారు వస్తువులను కాజేసిన నిందితులను అనకాపల్లి పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన టి.గోవిందమ్మ ఈనెల 5న ఆటోలో వస్తుండగా పూడిమడక రోడ్డు వద్ద అదే ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు కత్తితో బెదిరించి తొమ్మిది తులాల బంగారు వస్తువులను కాజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కె.కోటపాడు మండలం కొట్లాం గ్రామానికి చెందిన రావుల ఎల్లారమ్మ, కొత్తవలసకు చెందిన మేకల సంధ్య, గంటా మీన, ఆటో డ్రైవర్ మేకల హరిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

సీఎస్‌డీటీ బాధ్యతల స్వీకరణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట సీఎస్‌డీటీ జయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈమె గంట్యాడ నుంచి ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఆమెకు రేషన్ డీలర్ల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఉమాశంకర్రావు తదితరులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సహాయం అందేలా కృషి

శృంగవరపుకోట: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరమణపేటకు చెందిన జి.కృష్ణ భార్య లక్ష్మి ఇద్దరు చంటి పిల్లలతో మంగళవారం లక్కవరపుకోటలో ఎమ్మెల్యే లలితకుమారిని కలిసి సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పిల్లలను చూసి చలించిన ఎమ్మెల్యే.. సీఎం సహాయనిధి నుంచి సాయం అందేలా కృషి చేస్తానన్నారు.

లారీ ఢీకొని తీవ్రగాయాలు

విజయనగరం నేరవార్తా విభాగం: మండలంలో అయ్యన్నపేట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం లారీ- బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అయ్యన్నపేటకు చెందిన వై.మోహన్ వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై విజయనగరం వచ్చి తిరిగి వెళ్తుండగా.. లారీ ఢీకొట్టింది. కాలిపై నుంచి చక్రాలు వెళ్లిపోవడంతో నుజ్జయింది. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించగా.. కాలును పూర్తిగా తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

అధికారులకు సత్కారం

భోగాపురం: వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన అధికారులు, సిబ్బంది 37 మందికి ఎంపీపీ అనూషారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కిశోర్‌కుమార్, ఈవోపీఆర్డీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



జూద శిబిరంపై దాడి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోట పట్టణంలోని నూకాలమ్మ ఆలయం సమీపంలోని జూద శిబిరంపై దాడి చేసి రూ.11,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

జిల్లాలో 40 కేసుల నమోదు

జామి, న్యూస్‌టుడే: ఓ వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జామిలోని ఓ రెస్టారెంట్‌ను జిల్లా ఆహార భద్రతా నియంత్రణ అధికారి షేక్ నాగులమీరా మంగళవారం తనిఖీ చేశారు. లైసెన్సు లేదని గుర్తించారు. నమూనాల నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో 40 కేసులు నమోదు చేశామని, అపరాధ రుసుం రూ.1.50 కోట్లు విధించామన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే భేటీ

కొత్తవలస: కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పీడీ సందీప్, రెవెన్యూ డివిజనల్ అధికారి దాట్ల కీర్తిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి విజయనగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే భర్త కేబీఏ రాంప్రసాద్ పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నిత్యావసరాలు

విజయనగరం ఉడాకాలనీ: దసరా, పైడితల్లి పండగలను దృష్టిలో పెట్టుకుని సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ టోకు వర్తకులతో సమావేశం నిర్వహించారు. ధరలు తగ్గించి బుధవారం నుంచి విజయనగరంలోని అన్ని రైతుబజార్లలో అమ్మకాలు జరపాలని కోరారు.